క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు జరుపుతున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి పైనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చాతుర్మాస దీక్షలో భాగంగా సుందరకాండ హవనం, శ్రీనివాస కల్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు వెంకన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ



బాధితుడి బ్యాగ్‌ను అందిస్తున్న హెచ్‌సీ డీకేవీ స్వామి

పెందుర్తి: జీవీఎంసీ పరిధి వేపగుంట ప్రాంతానికి చెందిన డొంతుకూరి వెంకటసత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాలతో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డీకేవీ స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. పోయిన నగదు బ్యాగ్ అందించిన హెడ్ కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

నిత్యావసర సరకుల అందజేత



అనాథ బాలలతో గొందేశి సుధీర్‌రెడ్డి

పెదగంట్యాడ: పేదలు, అనాథలను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన గొందేశి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో గల ట్రూత్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. అందులోని అనాథ బాలలతో కాసేపు గడిపారు. వారికి నెలకు సరిపడా సుమారు రూ.30వేల విలువైన నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా అనాథ బాలలకు తన వంతు సాయం అందిస్తున్నానని చెప్పారు.

వాకింగ్ ట్రాక్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో చెత్తాచెదారం శుభ్రం చేసిన వాకర్స్

అగనంపూడి: ప్రతీ వాకర్ ఆహ్లాదకరమైన వాతావరణంలో నడిచేలా ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ అన్నారు. అగనంపూడి ఉక్కు ఆస్పత్రి రహదారిలోని అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆవరణలో చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సారి జీవీఎంసీ స్వచ్ఛ భారత్ పోటీల్లో వాకింగ్ ట్రాక్ కూడా పాల్గొని స్వచ్ఛ అవార్డు దక్కించుకొనేలా వాకర్స్ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉక్కు సీనియర్ మేనేజర్ కె.వి.వి.నాయుడును ఘనంగా సత్కరించారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడుగల నరసింగరావు, చిన్ని పూర్ణ, జెర్రిపోతుల రమణ, పిల్లా శ్రీనివాసరావు, గంధం బాబూ రావు, మెహర్‌బాబా, సీహెచ్.శంకరరావు, కృష్ణారావు, వెంకట్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు అవార్డులు

పెదగంట్యాడ: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో విజయవాడలో ఐకాన్ అకాడమిక్ అచీవ్‌మెంట్స్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిట్ల సుందరం, చంద్రశేఖర్, జనార్దన్, సుబ్రహ్మణ్యం, రాజు తదితరులు అప్సా ఐకాన్ అవార్డులు అందుకున్నారు.

జంక్షన్.. టెన్షన్

అడవివరంలో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ తర్వాత గోశాల, అప్పన్న తొలిపావంచా జంక్షన్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ జంక్షన్ల పేరెత్తితే చాలు.. పాదచారులు, వాహనదారులు భయభ్రాంతులు చెందుతున్నారు. ఏ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. సర్కిల్ పాయింట్లు, డివైడర్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

- ప్రమాదాలకు నిలయాలుగా గోశాల, తొలిపావంచా కూడళ్లు
- మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనదారులు
- పాదచారులు రోడ్డు దాటాలంటే గగనమే!



తొలిపావంచా జంక్షన్

సింహాచలం: పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్‌లో భాగంగా అడవివరంలోని గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు రోడ్డు విస్తరించారు. దీంతో గోశాల, తొలిపావంచా వద్ద భారీ జంక్షన్లు ఏర్పడ్డాయి. ప్రతి నిత్యం అటు గోపాలపట్నం, ఇటు వేపగుంట నుంచి వేలాది వాహనదారులు గోశాల, తొలిపావంచా జంక్షన్ల మీదుగానే విశాఖ నగరంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. విశాఖ నగరం నుంచి గోపాలపట్నం, వేపగుంట మీదుగా సింహాచలానికి ఈ మార్గంలోనే చేరుకుంటారు. వీరంతా గోశాల, తొలిపావంచా జంక్షన్ల వద్దకు వచ్చేసరికి ఏ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో అంచనా వేయలేకపోతున్నారు. మరోవైపు ఈ ప్రాంతాల్లో అధిక వేగంతో వచ్చే వాహనాలను చూసి బెంబేలెత్తుతున్నారు. ఇక పాదచారులైతే ఈ కూడళ్లలో రోడ్డు దాటాలంటే గగనంగా మారుతోంది.

విస్తరణతో సరిపెట్టారు..!

గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ కారిడార్ విస్తరణ పనులు పూర్తి చేసిన అధికార యంత్రాంగం.. మిగిలిన పనులను పక్కన పెట్టేసింది. ఈ కూడళ్ల వద్ద డివైడర్లు, సిగ్నల్ లైట్లు, సర్కిల్ పాయింట్లు తదితర పనులు చేపట్టలేదు. దీంతో వాహనాల స్పీడ్‌కు కళ్లెం వేయలేని పరిస్థితి నెలకొంది.

ప్రణాళిక మార్చేశారు

గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు రెండు కిలోమీటర్ల మేర మూడు రోడ్లుగా విస్తరణ చేయాల్సి ఉంది. బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ ప్రణాళికలో ఆ విధంగానే ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రణాళికను మార్చేసింది. మూడు రోడ్ల కాస్తా.. రెండు రోడ్లే అయ్యాయి. రోడ్డు కొలతలు, అలైన్‌మెంట్లు కూడా మారిపోయాయి. ఒకవైపు ఉన్న రోడ్డులో ఒకేసారి మూడు భారీ వాహనాలు పక్కపక్కనే వెళ్లొచ్చు. దీంతో వాహనదారులు మార్జిన్లు తెలియక తికమకపడుతున్నారు. ఆయా కూడళ్ల వద్ద పాదచారులు రోడ్డు దాటాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిందే. మరోవైపు ఈ మార్గంలో ఇప్పటికీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రుళ్లు అంధకారంలోనే ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి.



గోశాల జంక్షన్ వద్ద ఇష్టారీతిన రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

ఈ కూడళ్లలో ఇటీవల జరిగిన ప్రమాదాలు

- గత నెల మొదటివారంలో తొలిపావంచా సమీపంలో కలశం జంక్షన్‌లో రోడ్డు దాటుతున్న సింహాచలం దేవస్థానం ఉద్యోగి ఈశ్వరరావును ఆటో ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి.
- గతనెల 14న గోశాల జంక్షన్‌లో గోపాలపట్నం నుంచి సింహాచలం వస్తున్న బైకు, సింహాచలం నుంచి గోపాలపట్నం వైపు వెళ్తున్న బైకు ఢీకొన్న ఘటనలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో నాయుడుతోటకు చెందిన సరస్వతి, కిరణ్ గోపాలపట్నం వైపు నుంచి సింహాచలం బైక్‌పై వస్తుండగా సింహాచలం నుంచి వేపగుంట వైపు మలుపు తిరుగుతున్న కారు వారి వాహనాన్ని గోశాల జంక్షన్‌లో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సరస్వతికి గాయాలయ్యాయి.
- గత ఏడాది డిసెంబర్‌లో సింహాచలం నుంచి వేపగుంట వెళ్తున్న ఆర్టీసీ బస్సు గోశాల కూడలి వద్ద మలుపు తిరుగుతూ గోపాలపట్నం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది.



డివైడర్ లేకపోవడంతో పక్కరోడ్డులోకి నేరుగా వస్తున్న వాహనాలు



గోశాల జంక్షన్ వద్ద గతనెల 14న జరిగిన ప్రమాదంలో గాయపడ్డ యువకుడు

చర్యలు తీసుకోవాలి



అప్పన్న తొలిపావంచా, గోశాల, కలశం జక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని చూస్తే భయమేస్తోంది. ఈ ప్రాంతాల్లో ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని వాహనదారులు, పాదచారులు భయపడుతున్నారు. పోలీసులు దృష్టి సారించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, అప్పన్నపాలెం

జీవీఎంసీకి లేఖ రాశాం



గోశాల, తొలిపావంచా, కలశం జంక్షన్, అడవివరం, న్యూ టోల్‌గేట్ వద్ద రోడు మధ్యలో డివైడర్ల ఏర్పాటుకు జీవీఎంసీకి లేఖ రాశాం. ఆయా కూడళ్ల వద్ద ఎన్ని డివైడర్లు అవసరమౌతాయో కొలతలు కూడా ఇటీవల తీసుకున్నాం. జీవీఎంసీ నుంచి డివైడర్లు రాగానే వాటిని ఆయా జంక్షన్‌ల వద్ద ఏర్పాటు చేస్తాం.

– సూరిబాబు, ట్రాఫిక్ ఎస్ఐ, గోపాలపట్నం

కాలువల్లేక రోడ్డుపైనే మురుగు



మురుగు కూపంగా మారిన మూలస్వయంభూవరం రోడ్డు

పరవాడ: మండలంలో కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామంలో మురుగు కాలువలు ఏర్పాటు చేయని కారణంగా గ్రామ ప్రధాన రహదారి మురికి కూపంగా మారింది. గ్రామస్తుల వాడుక నీరు రోడ్డు మీదకు చేరి గుంతల్లో నిలిచిపోతోంది. దీంతో రహదారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వీధి కాలువలు నిర్మించడానికి పంచాయతీ పాలకవర్గం కనీస చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాడుక నీరు పోవడానికి మార్గం లేక వృథా నీరంతా రోడ్డుపై నిలిచిపోతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి మురుగునీరు పోవడానికి వీలుగా కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

పరవాడ: భారీ వాహనాల రాకపోకలతో ఎన్టీపీసీ-సోమునాయుడుపాలెం రోడ్డు అధ్వానంగా మారింది. రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీలతో రోడ్డు గోతులమయంగా మారిన నేపథ్యంలో అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలతో వర్షం కురిసినపుడు, రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధిక బరువుతో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా గోతులు మరింత పెద్దవిగా మారుతున్నాయి. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు గోతుల కారణంగా తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అధ్వానంగా సోమునాయుడుపాలెం రోడ్డు

మొల్లోడుగెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు



రసాయన వ్యర్థ జలాలతో రంగు మారిన మొల్లోడుగెడ్డ నీరు

పరవాడ: మండలంలోని భర్నికం సమీపంలో ఉన్న మొల్లోడిగెడ్డలో నిలిచిన వ్యర్థ రసాయన జలాలను బయటకు తోడించాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మా యాజమాన్యాలు ఇష్టానుసారంగా రసాయన వ్యర్థ జలాలను గెడ్డలోకి విడుదల చేయడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. దీంతో వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఆదివారం ఆయన మొల్లోడి గెడ్డను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థ జలాలు విపరీతమైన దుర్వాసన వెదజల్లుతున్నాయని ఫలితంగా రహదారి ప్రయాణికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. దీనిపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారని ఆక్షేపించారు. మొల్లోడిగెడ్డ ప్రాంతాన్ని రాష్ట్ర పీసీబీ చైర్మన్ కృష్ణయ్య పరిశీలించి వెళ్లారని, అయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు.

సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న శంకరనారాయణ



సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని 76వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ అన్నారు. ఈ మేరకు నడుపూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని ప్రజలు అదానీ గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్నారు. సమావేశంలో తాటికొండ జగదీష్, తలారి నాగేశ్వరరావు, బెల్లాల పెంటబాబు, బ్రహ్మానందరెడ్డి, శీరం రమణ, దాసరి రమణ, రామారావు, బెల్లాల నాగేశ్వరరావు, శరత్ కుమార్, శీర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

–మండలంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుందామని, ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు స్థానిక ప్రజలంతా తరలివచ్చి తమ గొంతు వినిపించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాతగాజువాక జంక్షన్ నుంచి ప్రజలను చైతన్య పరిచేందుకు ఆదివారం ప్రచారం నిర్వహించారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 10 లక్షల మంది ప్రజలు తీవ్ర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎం. రాంబాబు, అయోధ్యరామయ్య, గొలగాని అప్పారావు, నూకేశ్వరరావు, బంగారునాయుడు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి సన్నిధిలో అదీప్‌రాజ్



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు సతివానిపాలెంలో కొలువైన సత్తెమ్మతల్లిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి చెందిన నెక్కల గురుమూర్తి ఆహ్వానం మేరకు వెళ్లిన ఆయన వెంట వార్డు అధ్యక్షుడు గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్, నూక అప్పారావు, ఒమ్మి రాజు, లక్ష్మణ్, సత్తివాడ కనకరాజు, వెదురురాజు, సీతరాజు, రంజిత్, కరోతి సతీష్ ఉన్నారు.

దంచికొట్టిన వాన



పగలంతా ఎండ.. ఉక్కబోత వాతావరణం. సాయంత్రానికి ఆకాశం మబ్బులు పట్టింది. చిటపట చినుకులుగా మొదలైన వాన గంటకు పైనే దంచి కొట్టింది. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెందుర్తి, అడవివరం, వేపగుంట, సింహాచలం తదితర ప్రాంతాల్లో రోడ్లు ముంచెత్తాయి. పది అడుగుల ముందు ఏముందో కూడా కనిపించనంత కుండపోతగా వర్షం కురవడంతో వాహనదారులు ఎక్కడికక్కడ తమ వాహనాలను నిలిపేశారు. సమీప దుకాణాలు, ఇళ్లు, బస్టాప్‌లలో వర్షం తగ్గుముఖం పట్టేవరకు ఆగిపోయారు. అడవివరం ప్రధాన రహదారిపై వర్షం నీరు పెద్ద ఎత్తున ప్రవహించి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగించింది.

– సింహాచలం

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

మధురవాడ: ఏపీ ఎస్ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌ఎం అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం మధురవాడలో నిర్వహించిన రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈపీఎఫ్‌కి సంబంధించి సరైన డాటా అందించాల్సి ఉందన్నారు. ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా 10డి ఫారాలు నింపి పంపాలన్నారు. దీనికి ఎటువంటి సహకారం కావాలన్నా విశాఖ జిల్లాలో ఉన్నా యూనిట్లను సంప్రదించవచ్చన్నారు. ఆరోగ్య సమస్యలు పరిష్కారానికి రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగి, గుండె వైద్య నిపుణుడు అయిన సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించాలని, ఎంవీపీలోని సంస్థ డిస్పెన్సరీలో ప్రతి శుక్రవారం ఉచిత కన్సల్టేని సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఏవీ రావు, రాయి, ఇతర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం



లంకెలపాలెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి/పెందుర్తి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 9న నర్సీపట్నం మెడికల్ కళాశాల సందర్శనకు వస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లంకెలపాలెం కూడలిలో ఘనస్వాగతం పలికి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 79, 85 వార్డుల ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. భారీ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు. 85,79 వార్డుల అధ్యక్షులు జి.పూర్ణానందశర్మ(పూర్ణ), అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి, గెంజి సురేష్, సాలాపు సంతోష్, బొడ్డపు శ్రీను, సాలాపు శ్రీను, సిమ్మ సునీల్, నక్కా హరికిషోర్ పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్




పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి



నిందితుడితో పెందుర్తి పోలీసు సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పార్లుపాలెం రెవెన్యూ పరిధి ఆర్ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రిగెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాలు వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్ఐ ఎస్వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. పోలీసులు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, చార్కోల్, సున్నం, పీవీసీ మందు, తారా జువ్వలు, బెల్ట్ బాంబులు, డ్రిల్లింగ్ మిషన్, ప్రెస్సింగ్ మిషన్, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ భాస్కరరావు వెల్లడించారు.

పనిచేయని కోచ్ ఇండికేటర్లు



1, 4 ప్లాట్‌ఫారాలపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

అగనంపూడి: వేలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగించే దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కోచ్ ఇండికేటర్లు పనిచేయట్లేదు. ఐదు రోజులుగా డిజిటల్ కోచ్ ఇండికేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. అసలే దసరా సెలవులు ముగియడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ తరుణంలో ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారాలపై కోచ్ ఇండికేటర్లు పనిచేయని కారణంగా ప్రయాణికులు లగేజీలు, పిల్లలు, వృద్ధులతో పరుగులు తీయాల్సి వస్తోంది. ఏ కోచ్ ఎక్కడ ఆగుతుందో తెలియని పరిస్థితుల్లో గందరగోళానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోపోవడంతో ఐదు రోజులుగా ప్రయాణికులకు ఉరుకులు పరుగులు తప్పడం లేదు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కోచ్ ఇండికేటర్లను అందుబాటులో తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.